క్లుప్తంగా

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యం దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి రూరల్: మండలంలోని గ్రామాల్లో అక్రమంగా మద్యం షాపులు నిర్వహించి మద్యం బాటిళ్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చీమకుర్తి సీఐ సుబ్బారావు హెచ్చరించారు. మద్యం దుకాణాల యజమానులు బెల్టు షాపుల వారిని ప్రోత్సహిస్తే మద్యం దుకాణం లైసెన్సు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గురువారం మద్యం దుకాణాల యజమానులతో తన కార్యాలయంలో సీఐ మాట్లాడారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తే తన నంబర్ 9121102131కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని మండల ప్రజలను సీఐ కోరారు.

సచివాలయాన్ని పరిశీలించిన ఎంపీడీఓ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు సచివాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. హౌస్ టు హౌస్ క్యాప్సిలింగ్, ఎన్పీసీఐ లింకు అప్ డేటింగ్ తదితర వాటిపై సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సమీక్షించారు. పెండింగ్ లేకుండా వేగవంతంగా పనులు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగమూరులో జరిగిన ప్రత్యేక ఆధార్ క్యాంపులో వివిధ మార్పులు, చేర్పులకు సంబంధించి 42 రిజిస్ట్రేషన్లు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎం.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

చీమకుర్తి: ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఈ నెల 26వ తేదీ జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి రైతు సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద రైతుల సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26న ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, రైతుల ఆత్మహత్యల నివారణకు రుణవిమోచన చట్టాలు తీసుకురావాలని, ఇతర డిమాండ్ల సాధనకు నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెజవాడ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనాల మొలకశాతం పెరుగుదల



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న యూనిట్ ఇన్‌చార్జ్ రాధా

ఒంగోలు సిటీ: బీజామృతం వలన విత్తనాల మొలక శాతం గణనీయంగా పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రాధా సింగమనేని అన్నారు. గురువారం ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికార సంస్థ డీపీఎంయూ సుభాషిణి ఆధ్వర్యంలో బీజామృతంతో విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాధా సింగమనేని మాట్లాడుతూ విత్తనశుద్ధితో విత్తనాలలో ఉండే వ్యాధులను నివారించవచ్చన్నారు. భూమిలో ఉండే తెగుళ్లను కూడా నివారించవచ్చన్నారు. శుద్ధి చేసిన విత్తనాల ద్వారా మంచి దిగుబడి సాధించడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. బీజామృతంతో విత్తనశుద్ధి ఎలా చేయాలో రైతులకు వివరించడమే కాకుండా దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్ పీఎస్ కొమ్ము మన్మథ, ఐశ్వర్య, రైతులు పాల్గొన్నారు.

సంపదంతా చెత్త పాలు..!

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- సంతనూతలపాడు మండలంలో వృథాగా ఉన్న 15 కేంద్రాలు
- కూటమి ప్రభుత్వంలో వాటి ఊసే ఎత్తని పాలకులు, అధికారులు
- చొరవ చూపితే ఆదాయం వచ్చే అవకాశం



సంతనూతలపాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

సంతనూతలపాడు: సంపద సృష్టించి అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల సమయంలో కల్లబొల్లి హామీలిచ్చిన చంద్రబాబు.. సీఎం అయ్యాక ఆ ఊసే ఎత్తడం లేదు. నిధులు లేవని, ఎన్నికల హామీలు, పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేశారు. ఇక, పంచాయతీల అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా గ్రామాల్లో పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో గ్రామాల్లో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పర్యవేక్షణ కరువై నిరుపయోగంగా మారాయి. వీటి ద్వారా ఆదాయం రాబట్టి పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ఆ దిశగా ఆలోచించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

సంపద సృష్టించకపోగా, ప్రజాధనం వృథా...

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేశారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించేందుకు బ్యాటరీ బండ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, సీసాలు పొడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యంత్రాలు కేటాయించింది. ఆయా కేంద్రాల్లో పనిచేసేందుకు గత ప్రభుత్వం క్లీన్ మిత్రలను కూడా నియమించింది. వీరు చెత్త సేకరిస్తారు. వాటిని వేరు వేరు తొట్లలో వేసి కుళ్లించి వానపాములతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు. ఇక్కడ తయారైన ఎరువులను ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు విక్రయించాలి. కిలో కంపోస్ట్ ఎరువు ఎనిమిది రూపాయల నుంచి పది రూపాయల వరకు విక్రయిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. తయారైన ఎరువులను రైతులకు విక్రయించాలని పెట్టుకున్న లక్ష్యం నీరుగారి సంపద తయారీ కేంద్రాలు ప్రస్తుతం షెడ్లకే పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి చెత్త సేకరించి వానపాముల ద్వారా ఎరువుల తయారీ పడకేసింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లోని మురుగు కాలువల్లో, వీధుల్లో చెత్త కనిపిస్తోంది. ప్లాస్టిక్, గాజు సీసాలు పేరుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులన్నీ వృథా అయ్యాయి.



మైనంపాడులో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఒక్కో కేంద్రానికి రూ.6 నుంచి రూ.9 లక్షల ఖర్చు...

సంతనూతలపాడు మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 15 గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.6 నుంచి రూ.9 లక్షలు ఖర్చు చేశారు. మండలంలోని రుద్రవరం, మైనంపాడు, పి.గుడిపాడు, కొనగానివారిపాలెం, సంతనూతలపాడు, చంద్రపాలెం, పి.తక్కెళ్లపాడు, ఎనికపాడు, గుమ్మలంపాడు, చిలకపాడు, ఎం.వేములపాడు, కామేపల్లివారిపాలెం, మంగమూరు, ఎండ్లూరు, ఆర్.లక్ష్మీపురం గ్రామాల్లో కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. బొడ్డువారిపాలెం, గురవారెడ్డిపాలెం, మద్దులూరు గ్రామాలకు మంజూరు కాలేదు. 15 గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు స్థల సేకరణ చేసి నిర్మాణంపై పెట్టిన శ్రద్ధ వాటిని వినియోగించడంలో లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మందుబాబులకు స్థావరాలుగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. కోట్లు ఖర్చు చేసినా వాటి ద్వారా ఆదాయం లేకపోగా, దుర్వినియోగం అవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కేంద్రాల వినియోగంపై చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త నుంచి ఆదాయం రాబట్టి గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> **త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం**
> సంతనూతలపాడు మండలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో త్వరలో పనులు ప్రారంభిస్తాం. కేంద్రాల్లో ఎరువుల తయారీని ప్రారంభించి పంచాయతీలకు ఆదాయం వచ్చేందుకు కృషి చేస్తాం.
> – ఎంపీ రమణమ్మ, ఈవోపీఆర్డీ, సంతనూతలపాడు

> **వినియోగంలోకి తీసుకురావాలి :**
> చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు కేంద్రాలు నిర్మించడం బాగుంది. అయితే, అవి నిరుపయోగంగా ఉండకూడదు. ప్రభుత్వం చొరవ తీసుకుని సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలి. ఎరువుల తయారీకి ప్రణాళికలు రూపొందించాలి. వర్మీ కంపోస్టు తయారు చేసి స్థానిక రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాలి.
> – కుంచాల అంజయ్య, సంతనూతలపాడు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బొట్ల సుబ్బారావు

వైఎస్ జగన్‌ను కలిసిన బొట్ల సుబ్బారావు

ఒంగోలు వన్‌టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు గురువారం తాడేపల్లిలో కలిశారు. పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టించి పోలీసులతో వేధిస్తోందని తెలిపారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ టెలివిజన్ డే



టెలివిజన్ రూపకర్త చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేస్తున్న టీవీ మెకానిక్‌లు, మారెళ్ల సుబ్బారావు

ఒంగోలు మెట్రో: ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఒంగోలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెకానిక్ అసోసియేషన్, ఒంగోలు ఎలక్ట్రానిక్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ జెండాను సంస్థ గౌరవాధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ఆవిష్కరించారు. టీవీ రూపకర్త జాన్ లోగి బెయిర్డ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ 1927 సెప్టెంబర్ 7న జాన్ లోగి బైర్డ్ టీవీ కనిపెట్టి ప్రపంచానికి ఎంతో మేలు చేశారని అన్నారు. బ్లాక్ అండ్ వైట్లో కనిపెట్టిన టీవీ కాలానుగుణంగా కలర్లో ఆధునికత సంతరించుకుందన్నారు. కానీ, టీవీ మెకానిజంపై ఆధారపడిన ఎంతోమంది ఇప్పుడు ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. కొత్త కొత్త మోడల్స్ వస్తున్నాగానీ వాటి స్పేర్ పార్ట్స్ దొరకడం లేదని, దీనివల్ల టీవీ రంగాన్నే నమ్ముకున్న మెకానిక్‌లు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం టీవీ మెకానిక్‌ల ఆర్థిక స్థితిగతులను ఆలోచించి వారికి సహకారం అందించాలని కోరారు. కొత్తగా వస్తున్న టెక్నాలజీపై టీవీ మెకానిక్‌లకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తే వారంతా ఉపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. ఈ సందర్భంగా సీనియర్ మెకానిక్ శివకుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. సీఐటీయూ నాయకుడు గంటినపల్లె శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారాజు, ఒంగోలు ఎలక్ట్రానిక్ డెవలప్మెంట్ అసోసియేషన్ కార్యదర్శి కె.చిరంజీవి, హుస్సేన్ బాషా, సురేష్ కుమార్, బుజ్జి, వెంకటేశ్వర్లు, జయరాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గలీజుగా గద్దలగుంట రోడ్డు



గుంతలమయంగా మారి మట్టిరోడ్డును తలపిస్తున్న గద్దలగుంట ప్రధాన రహదారి



మామిడిపాలెంలో రోడ్డుపైనే ఉన్న చెత్త

- ప్రధాన రహదారి సైతం గుంతలమయం
- వాహనదారులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మొదటిగా గుంతలు లేని రోడ్లు.. ఆ తర్వాత కొత్త రోడ్ల నిర్మాణాలు చేపడతామని సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం డీఆర్సీ సమావేశంలో చెప్పారు. కానీ, నేటికీ ఆచరణ సాధ్యం కాలేదు. కూటమి ప్రభుత్వంలో చెప్పేది ఒకటి..చేసేది మరొకటి అన్న చందంగా ఒంగోలు నగరంలో పరిస్థితి ఉంది. పేరుకు జిల్లా కేంద్రమైనప్పటికీ నగరంలో అనేక ప్రధాన రహదారులు సైతం గంతలమయంగా మారి వాహనదారులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు రోడ్ల మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక గద్దలగుంట ప్రధాన రహదారే అందుకు నిదర్శనంగా ఉంది. ఈ దారిలో మూడు బొమ్మల సెంటర్, శర్మ కాలేజీకి వెళ్లే మలుపు వద్ద పూర్తిగా సిమెంటు రోడ్డు కొట్టుకుపోయి మట్టి రోడ్డు మిగిలింది. అది కూడా గుంతలమయంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి లాయర్‌పేట మీదుగా హౌసింగ్ బోర్డు, మోడల్ టౌన్, భాగ్యనగర్ వచ్చేందుకు గద్దలగుంట రోడ్డు ప్రధానమైనది. గద్దలగుంట ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ, ఈ రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడిపాలెంలో అధ్వానంగా పారిశుధ్యం...

గద్దలగుంటకు ఆనుకుని ఉన్న మామిడిపాలెంలో శ్మశానానికి వెళ్లే రహదారిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆ చుట్టుపక్కల పారిశుధ్యం అధ్వానంగా ఉంది. రోడ్డుపైనే చెత్తకుప్పలు పేరుకుపోయాయి. శ్మశాన రహదారే కదా అని పారిశుధ్య సిబ్బందితో పాటు అధికారులు కూడా పట్టించుకోకుండా వదిలేయడంతో దుర్భరంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు పక్కన భారీ డస్ట్‌బిన్‌లు ఉన్నప్పటికీ.. రోడ్డుపైనే చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో చెత్త, మురుగు కలిసి పారిశుధ్యం మరీ దారుణంగా తయారవుతోందని చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. దోమల బెడద పెరిగిపోతోందని, అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి గద్దలగుంట రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు మామిడిపాలెంలో చెత్త తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

దర్గాగా కబ్జా..!

- దేవదాయశాఖ స్థలంలో పశువుల షెడ్డు నిర్మాణం
- అనుమతులు కూడా మంజూరు చేసిన అధికారులు



దేవదాయశాఖ స్థలంలో నిర్మిస్తున్న పశువుల షెడ్డు

నాగులుప్పలపాడు: కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లుంది కూటమి ప్రభుత్వంలో ఆయా పార్టీల నాయకుల తీరు. ఇలాంటి కబ్జాలకు ఏకంగా ప్రభుత్వ అధికారులు కూడా అనుమతులిస్తే ఇక చేసేదేముంటుంది. నాగులుప్పలపాడు మండలంలోని ఓబన్నపాలెం గ్రామంలో అదే జరిగింది. కబ్జా చేసిన దేవదాయశాఖ స్థలంలో నిర్మాణానికి స్వయంగా ప్రభుత్వ అధికారులే అనుమతులు జారీ చేశారు. ఏకంగా ప్రభుత్వ నిధులతోనే అందులో పశువుల షెడ్డు నిర్మిస్తుండటం విడ్డూరంగా ఉంది. పూర్తి వివరాల్లోకెళ్తే... ఓబన్నపాలెం గ్రామంలో ఎండోమెంట్ పరిధిలో నరసింహామూర్తి చెరువు కింద సుమారు 23 ఎకరాల దేవదాయశాఖ భూమి ఉంది. ఈ చెరువు చుట్టుపక్కల గ్రామాల్లోని కొందరు వ్యక్తులు దేవదాయశాఖ భూమిలో తాత్కాలికంగా గడ్డివాములు, పశువుల కొష్టాలు వేసుకున్నారు. ఇంతవరకు భాగానే ఉన్నప్పటికీ.. పాడిరైతుల కోసం ప్రభుత్వం ఉపాధి పథకం అనుసంధానంతో అర్హత ఉన్న రైతులకు 90 శాతం ప్రభుత్వ సబ్సిడీతో పశువుల షెడ్లు కట్టించడానికి రూపకల్పన చేసింది. ఈ పథకంలో ముఖ్యంగా రైతుకు తన పేరు మీద కనీసం 3 సెంట్ల స్థలం ఉండాలి. షెడ్డు నిర్మించడానికి ఆ స్థలం చూపించాలి. అయితే, ఓబన్నపాలెం గ్రామంలో మంజూరైన పశువుల షెడ్డుకు పోలినేని రంగారావు అనే రైతు దేవదాయశాఖ స్థలాన్ని తమ సొంత స్థలంగా అధికారులకు చూపించాడు. అధికారులను తప్పుదోవ పట్టించినప్పటికీ.. వారు ఆ స్థలాన్ని పరిశీలించకుండానే అనుమతులన్నీ మంజూరు చేశారు. దీంతో దేవదాయశాఖకు చెందిన నరసింహామూర్తి చెరువు స్థలంలో ప్రభుత్వ నిధులతో పశువుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై ఎండోమెంట్ ఈవో సుబ్బారావును వివరణ కోరగా, ఓబన్నపాలెం గ్రామంలో ప్రస్తుతం పశువుల షెడ్డు నిర్మిస్తున్న స్థలం తమ శాఖకు చెందినదిగా నిర్ధారణ అయిందని, అందులో నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు ఎలా ఇస్తారని అన్నారు. దానిపై ఆయా శాఖల అధికారులకు ఇప్పటికే నోటీసులు పంపించడం జరిగిందని తెలిపారు. త్వరలో సర్వే నిర్వహించి దేవదాయశాఖ ఆదీనంలో ఉన్న నరసింహామూర్తి చెరువు భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇదే విషయమై ఏపీవో రవిని వివరణ కోరగా, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే పశువుల షెడ్డు కోసం లబ్ధిదారుడు ఇచ్చిన పత్రాల ఆధారంగా అనుమతులు జారీ చేశామన్నారు. ఆ స్థలం దేవదాయశాఖ వారిదే అయితే పునఃపరిశీలన చేస్తామన్నారు.

ఘనంగా సామూహిక రుద్రపూజ



శివలింగానికి పూజలు చేస్తున్న రిషి దేవవ్రత్ శరణానంద గురువులు

ఒంగోలు మెట్రో: కార్తీక దామోదర మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన మాసమని, శివకేశవులను పూజించడం ద్వారా మానసిక ప్రశాంతత కలిగి ఉన్నత ధ్యాన స్థితిని చేరుకుంటామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ధ్యాన గురువులు బీఎస్ నారాయణరెడ్డి, పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక అంజయ్య రోడ్డులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక రుద్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రదోషకాలంలో దీపాలు వెలిగించి పరమ శివునికి అభిషేకం నిర్వహించడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ఏకేవీకే ప్రాంగణంలోని సరస్వతీ మాత విగ్రహం వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ ధర్మశాస్త్ర విభాగం ద్వారా ఏర్పాటు చేసిన వేదికపై శివలింగాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా రిషి దేవవ్రత్, శరణానంద గురువులచే గణపతి అధర్వ శీర్ష అంగన్యాలు, పంచామృతస్నానం, నమకచమకాదులతో వేదసహితముగా రుద్రపూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు, వివిధ హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని స్వామివారి ఆశీసులు పొందారు.

రేపు సత్యసాయిబాబా జయంతి

ఒంగోలు మెట్రో:

భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను ఒంగోలు మంగమూరుడొంక జెడ్పీకాలనీలోని సత్యసాయిబాబా మందిరంలో ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు కన్వీనర్ కోడెల శివ ప్రసాద్ తెలిపారు. ఉదయం ఐదు గంటలకు ఓంకారము, సుప్రభాతము, నగర సంకీర్తన, అనంతరం సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు మహానారాయణ సేవ జరుగుతుందన్నారు. అనంతరం స్వామివారి మహా ప్రసాదం వితరణ, 3 వేల మందికి అన్నదానం జరుగుతుందన్నారు. సాయంత్రం ఐదు గంటలకు వేదము, భజన, సాయి యువ స్వరం, ఆరు గంటలకు స్పెషల్ మ్యూజిక్ ప్రోగ్రాం, రాత్రికి బాలవికాస్, చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఎనిమిది గంటలకు మందిరంలో కేక్ కటింగ్, బాణసంచా, బాబా వారికి ఉయ్యాల సేవ, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ అజయ్ కుమార్

ఒంగోలు టౌన్: రోజురోజుకూ సైబర్ నేరాలు ఎక్కువైపోయాయని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తీవ్రంగా నష్టపోతారని ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ కె.అజయ్ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ముంగమూరు రోడ్డులో గల సరస్వతి కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసంగిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని ఎవరైనా దుర్వినియోగం చేసే అవకాశం ఉందేమో తెలుసుకుని మాత్రమే పోస్టులు చేయాలని సూచించారు. అనవసర విషయాలలో తలదూర్చి సమస్యలు కొనితెచ్చుకోవడం కంటే సోషల్ మీడియాకు దూరంగా ఉండటమే మేలని చెప్పారు. సోషల్ మీడియాకు రిక్వెస్టులు పంపించే సమయంలో, యాక్సెప్ట్ చేసే సమయంలో పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే యాడ్ చేసుకోవాలని చెప్పారు. ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దని, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద ఫోన్లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నాణ్యతను పరిశీలిస్తున్న జేఈ ప్రసాద్

మద్దిపాడు: గ్రామ పంచాయతీలలో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ జేఈ డి.ప్రసాద్ ఆదేశించారు. మండల పరిధిలోనే దొడ్డవరప్పాడు గ్రామ పంచాయతీలో గ్రామీణ అభివృద్ధి పథకం కింద ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో 420 మీటర్ల అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. గురువారం నాణ్యతా ప్రమాణాలను జేఈ పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ రవిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ASHOK LEYLAND BADA DOST 14 LS
BS6 2023 MODEL AP39 UQ 9081
Engine No : HPH038814P
Chassis No : MB1AB42E6PRHL1998
Cell: 73373 51808
D.No: 37-1-4(1), 2nd Floor, Vara Prasad Complex, Trunk Road, ONGOLE.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
చీమకుర్తి 84639 03727
Office mail : sakshiongads@gmail.com